క్లుప్తంగా

ఇసుక లారీల స్వాధీనం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని మొర్రవానిగూడెం గ్రామ శివారుల్లో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు ఇసుక లారీలను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో సివిల్ పోలీసులు, సీఆర్‌పిఎఫ్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మూడు ఇసుక లారీలను వేబ్రిడ్జి వద్ద బరువును పరిశీలించినట్లు తెలిపారు. ఈ మేరకు ఓవర్‌లోడ్‌తో ఉన్నట్లు గుర్తించి మూడు లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్లను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏటూరునాగారం: ఏటూరునాగారం మండలంలో నేడు (శనివారం) ఉదయం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు చిన్నబోయినపల్లి, రొయ్యూర్ ఫీడర్ కింద త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉండదని, సింగిల్‌ఫేజ్ మాత్రం ఉంటుందని డీఈ పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు.

పరామర్శ



మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి గ్రామానికి చెందిన పిల్లమర్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు గంట దేవేందర్, లింగమల్ల దుర్గయ్య, నజీర్‌ఖాన్, రమేష్, సదువలి తదితరులు ఉన్నారు.

'జనజాతర'కు తరలిరావాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: తుక్కుగూడలో నేడు(శనివారం) నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడలో జరిగే జనజాతర సభకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. తుక్కుగూడ సభకు పార్టీ అగ్ర నాయకులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, మేడారం జాతర చైర్మన్ అరెం లచ్చుపటేల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, గౌని మధు గౌడ్ పాల్గొన్నారు.

కేసు నమోదు

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన దబ్బెట స్పందన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్ కుమార్ తెలిపారు. మనుగొండకు చెందిన తాను, ధర్మారం గ్రామానికి చెందిన లింగాల కుమార్ ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నట్లు స్పందన ఫిర్యాదులో పేర్కొన్నారు. కుమార్ తల్లిదండ్రులు వివాహాన్ని అంగీకరించకపోవడంతో తాము మనుగొండలోనే నివాసం ఉన్నట్టు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల కుమార్‌తోపాటు అతడి తల్లిదండ్రులు దళితురాలివంటూ కులం పేరుతో దూషించి జుట్టుపట్టుకుని కొట్టినట్లు ఫిర్యాదులో వివరించారు. మామునూరు ఏసీపీ తిరుపతి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

వేలేరు : పేద ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వివిధ పార్టీల నుంచి 20 మంది కార్యకర్తలు సీపీఐలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూర్జువా పార్టీలకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. ఎర్రజెండా పార్టీలు నిరంతరం ప్రజల మధ్యలో ఉంటాయని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, జిల్లా నాయకులు భిక్షపతి, మేకల శంకర్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



ఏటూరునాగారం: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏపీఓ



ములుగు రూరల్: నివాళులర్పిస్తున్న సీతారాంనాయక్



రేగొండలో..

భూపాలపల్లి రూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ మొట్టమొదటి ఉప ప్రధాని సేవలు అందించారన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ డి.స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలి

ములుగు రూరల్: యువత డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అడుగుజాడల్లో నడవాలని బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. శుక్రవారం దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్ అధ్యక్షతన జయంతి వేడుకలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత ఉప ప్రధానిగా, వివిధ శాఖల్లో కేంద్రమంత్రి దేశానికి ఎనలేని సేవలు అందించాలని అన్నారు. అణగారిణ వర్గాల హక్కుల కోసం నిరంతం పోరాడిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బలరాం, నరోత్తంరెడ్డి, రమేస్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

ఏటూరునాగారం: మహనీయుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని భావితరాల వారికి వారి త్యాగాలను తెలియజేయాలని ఐటీడీఏ ఏపీఓ(జనరల్) వసంతరావు అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రావు జయంతి నిర్వహించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ.. జగ్జీవన్ రావు రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగిన వ్యక్తి అని దేశ ప్రజలకు ఎంతో సేవ చేశారని తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడు అన్నారు. బాలికల విద్యకు సైతం అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతి కుమార్, ఎస్‌ఓ రాజ్‌కుమార్, జేడీఎం కొండలరావు, డీటీ అనిల్, కిషోర్, ప్రభాకర్, మహేందర్ పాల్గొన్నారు.



మహదేవపూర్‌లో..

మహదేవపూర్: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు సురేష్, దుర్గయ్య, ధర్మయ్య, లక్ష్మణ్, లక్ష్మణ్, నాగరాజు, రవితేజ, శ్రీకాంత్, సదనందం, తరాచంద్ పాల్గొన్నారు.

రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో విశ్వతేజ ఫౌండేషన్, ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ ఆధ్వర్యంలో బాబూజగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీమాన్, నవీన్, బిన్ను, చందు, గణేష్, సాయి, సుజిత్, సాగర్, లడ్డు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న అధికారులు

ఏటూరునాగారం: మంగపేట మండలంలోని బోరు నర్సాపురం గ్రామంలో ఏటూరునాగారం ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. లోక్ సభ ఎన్నికల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో 10లీటర్ల గుడుంబా, 800ల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారు చేసిన అదే గ్రామానికి చెందిన భూక్యా లక్ష్మణ్ కుమార్, భూక్యా గంగాపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నవీన్, వీరన్న, శ్రీనివాస్, తిరుపతి, నాగరాజు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం సెంటర్‌లో మంగళవారం పోలీసులు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. వెంకటాపురం మండల కేంద్రానికి వాజేడు, చర్ల మండలాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానిత వ్యక్తుల వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

కాటారం: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కాంగ్రెస్ యూత్ నాయకుడు శ్రీనుబాబు అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని బీఎల్‌ఎం గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింతో కలిసి శ్రీనుబాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వీట్లు తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ హిందు, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, కో ఆప్షన్ సభ్యుడు అజీజ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న శ్రీనుబాబు

బీజేపీ మండల అధ్యక్షుడిగా మల్లారెడ్డి



కాటారం: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని గంగారం గ్రామానికి చెందిన బండం మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు పని చేయాలని సూచించారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డితో పాటు జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్సీ సిరికొండ



దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఎంతో అంగరంగా వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయంలో దేవాతా హోమాలు, అభిషేకాలు శాంతి కల్యాణం, తదితరులు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చివరి రోజు కావడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన గాయత్రి మాత పీఠాదీపతులు లలితా గాయత్రిమాత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరైయ్యారు. జెడ్పీటీసీ గొర్రె సాగర్, కమిటీ సభ్యులు, రాంరెడ్డి, సాయిరెడ్డి స్వామి, సత్యం, దేవేందర్‌రెడ్డి, అనంద్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలి



ప్రతిష్ఠాపన కార్యక్రమంలో నాయకులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కమలపూర్‌లో రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని అన్నారు. అలాగే ప్రతిష్ఠాపన కార్యక్రమానికి తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పాల్గొని ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండపాక సాంబయ్య, ఏరుకొండ సంపత్‌కుమార్, రాంచందర్, అశోక్, వెంకటస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీలు ప్రారంభం



పెద్దంపేట వద్ద గోదావరిలో ఇసుక క్వారీ రోడ్డు పనులు

మహదేవపూర్: ఉమ్మడి మండలంలో అంబట్‌పల్లి, పెద్దంపేట, పంకేన గ్రామాల్లో 6 ఇసుక క్వారీలు ప్రారంభం అవుతున్నట్లు శుక్రవారం టీఎస్‌ఎండీసీ పీఓ తరాక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో 2, 3, 4, నంబర్లు గల మూడు ఇసుక క్వారీలు ఒక క్వారీలో లక్ష యాభై వేల మెట్రిక్ టన్నుల ఇసుక తీయడం జరుగుతుందని తెలిపారు. పెద్దంపేట గ్రామంలో ఒక ఇసుకక్వారీ మంజూరైనట్లు తెలిపారు. ఇక్కడ కూడా లక్షా యాభై వేల మెట్రిక్ టన్నుల ఇసుక తీసేందుకు అనుమతి వచ్చిందని తెలిపారు. పలిమేల మండలం పంకేన గ్రామంలో రెండు ఇసుక క్వారీలు మంజూరయ్యాయని తెలిపారు. ఇక్కడ ఒక క్వారీలో ఆరు లక్షల యాభైవేల మెట్రిక్ టన్నుల ఇసుకతీసేందుకు టెండర్లు పూర్తయి.. పనులు త్వరలో ప్రారంభం అవుతాయని తెలిపారు. పెద్దంపేట గోదావరిలో ఇసుక తీసేందుకు రోడ్డు పనులు ప్రారంభం అయినట్లు చెప్పారు. ఈ ఇసుక క్వారీల్లో పూర్తిగా మనుషుల(మన్యూవల్) ద్వారా తవ్వకాలు చేపట్టనున్నట్లు పీఓ తెలిపారు.

గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలించొద్దు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలించవద్దని వెంకటాపురం ఎస్సై చల్లా రాజు సూచించారు. శుక్రవారం రామప్ప రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కూలీలతో వెళ్తున్న గూడ్స్ వాహనాన్ని ఆపి వాహన యాజమానితో పాటు కూలీలకు అవగాహన కల్పించారు. గూడ్స్ వాహనాలలో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. కూలీలను పరిమితికి మించి తరలిస్తున్న డ్రైవర్లకు కౌన్సెలింగ్ చేశారు. వాహన యాజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందజేత

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల భరత్ కడుపు నొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, వైద్యం కోసం రూ.లక్ష ఖర్చు అయితాయని వైద్యులు తెలుపగా స్థోమత లేక దాతల నుంచి ఆర్థిక సాయం కోరారు. దీంతో అదే గ్రామానికి చెందిన అబ్బు సతీష్ ఆధ్వర్యంలో పలువురి వద్ద నుంచి నగదు సేకరించి రూ.20 వేలను బాధితుడికి శుక్రవారం అందజేశారు. ప్రకాశ్, షైజోద్దీన్, ఎండీ.ఏ జాజ్, రవి ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

నేడు నిరసన

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నేడు(శనివారం)చేపట్టనున్న రైతు నిరసన దీక్షకు రైతులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంపీపీ తిరుపతిరెడ్డి శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీతో పాటు ఎకరానికి రూ.15000 రైతు భరోసా, వరికి కనీస మద్దతు ధర రూ. 2500, అన్ని పంటలకు రూ. 500 బోనస్ వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

'ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి'

నల్లబెల్లి : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి కోరారు. మండలంలోని మేడపల్లిలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో పల్లెలు సుభిక్షంగా ఉండగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరువు కోరల్లో చిక్కుకున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థ, మోసపూరిత పాలనతోనే పల్లెలో సాగునీటి సమస్య నెలకొందని చెప్పారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న పంటలకు సంబంధించి బాధిత రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని, రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనకు వ్యతిరేకంగా నేడు (శనివారం) ఉదయం పట్టణంలో నిర్వహించనున్న రైతు నిరసన దీక్షకు రైతులు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి మోహన్‌రావు, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, క్కొర్ల శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సారంగపాణి

దైవారాధనతోనే సుఖశాంతులు

నర్సంపేట : రానున్న క్రోధి నామ సంవత్సరంలో దైవారాధనతోనే ప్రజలకు సుఖశాంతులు లభించగలవని ప్రముఖ సిద్ధాంతి వెంకటాచార్యులు తేటతెల్లం చేశారు. శ్రీమాన్ ఉభయ వేదాంత పండితులు శ్రీమాన్ సంపన్ముడుంబై వెంకటాచార్యులు గణించిన శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధరణిశ్రీ ఫౌండేషన్ సౌజన్యముతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణమాచార్యులు, మాధవాచార్యులు, రామానుజాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్ధాంతి వెంకటాచార్యులు మాట్లాడారు. క్రోధి నామ సంవత్సర ఫలితాలను వివరించారు. కుటుంబాల్లో విరోధాలు తలెత్తుతాయని చెప్పారు. రాజకీయ నాయకుల్లో విభేదాలతో పరిపాలన అస్తవ్యస్తం అవుతుందని తెలిపారు. వర్షపాతం తక్కువగా ఉంటుందని, మే నెలలో అకాల వర్షాల వల్ల వ్యవసాయదారులు పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు. ఏప్రిల్ నుంచి కర్షకులకు కొంత మేలు జరుగుతుందన్నారు., కరువు ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. పరిశ్రమలు, వ్యవసాయదారులకు, ఉద్యోగస్తులు, చేతి వృత్తితో జీవితం గడిపే వారికి స్వల్ప లాభం ఉంటుందని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పంచాంగాన్ని గణించడం జ్యోతిష్య పండితులైన వెంకటాచార్యులకే సాధ్యమని కొనియాడారు. ఆలయ పునరుద్ధరణ పనులు చేపడతామన్నారు. కార్యదర్శి రంగనాథ్‌స్వామి మాట్లాడుతూ 200 పంచాంగములు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం వెంకటాచార్యులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విటి సభ్యులు రేణుక, రూప, లక్ష్మి శ్రీవిద్య, ఆలయ కమిటీ సభ్యులు నిరంజన్, శ్రీధర్, యాకయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటాచార్యులు

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

వేలేరు: అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై డి.హరిత హెచ్చరించారు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన బొల్లి రాజు బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. బెల్ట్‌షాపు నుంచి రూ.50 వేల విలువ గల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. బెల్ట్‌షాపుల నియంత్రణకు ప్రత్యేక దృష్టి వహిస్తున్నట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై